RNI No : APTEL 2020/80757
www.sreeprasthanam.in
శ్రీ ప్రస్థానం
మన దేశం..మన హక్కు
తెలుగు దినపత్రిక

# అవుల లారీని అడ్డుకున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు

నర్సాపురం,తూర్పు గోదావరి జిల్లా నుంచి అవులతో చెన్నై వెళ్ళుతున్న లారీని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లో భజరంగ్ దళ్, ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు నిలిపారు.ఒకే లారీలో సుమారు 24 ఆవులు, దూడలను ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. సమాచారం అందుకున్నడీఎస్పీ గంటి శ్రీనివాసరావు అక్కడికి సిబ్బందితో చేరుకున్నారు. ఆవుల రవాణా అనుమతిపత్రాలను పరిశీలించారు. అనుమతి పత్రాలపై సంతకాలు ఉన్న అధికారులకు ఫోన్ చేసిమాట్లాడి అనుమతి ఉన్నట్లు నిర్ధారించారు. ఆవులకు నీరు తాగించి తీసుకువెళ్లాలనిభజరంగదళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల సూచన మేరకు ఆ లారీని గోశాల వద్దకు తీసుకు వెళ్లారు.నరసాపురం డీఎస్పీ చౌరవతో ఆవుల రవాణా వ్యవహారంలో ఏర్పడిన సమస్య పరిష్కారమైంది.

విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిటి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 59 శుక్రవారం 28-06-2024 పేజీలు :04 వెల:రూ.2.00

# పోలీస్ వ్యవస్థను దిగజార్చిన గత ప్రభుత్వం

**నిధులు ఇవ్వకుండా నీరసింప చేశారు**
**కేవలం నాయకుల రక్షణకే పోలీసులు ఉపయోగం**
**గంజాయి నిర్మూలన, మహిళల రోణ తమ కర్తవ్యం**
**కక్షసాధింపు చర్యలకు తాము ఎప్పుడూ దూరమే**
**పోలీస్ ఉన్నతాధికారులతో హోమంత్రి అనిత సమీక్ష**






అమరావతి,జూన్27: నిర్దుష్ట ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, నాలుగు అంశాలను అజెండాగా పెట్టుకున్నామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గంజాయి నిర్మూలన, మహిళలకు రక్షణ, పోలీసుల సంక్షేమం, పోలీసు శాఖలో నియామకాల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'రెడ్ బుక్' కక్ష సాధింపు చర్యలకు కాదన్నారు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన అధికారులపై చట్టపరంగా చర్యలుంటాయని చెప్పారు. తమకు కక్ష సాధింపు ఉంటే.. ఇంతకాలం ఆగుతామా అని వ్యాఖ్యానించారు. పగ, ప్రతీకారాల ఆలోచన చేయడం లేదని.. తమ నాయకుడు చంద్రబాబు చెప్పిన ప్రకారం రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తామని చెప్పారు. డీజీపీ, ఇతర ఉన్నతాధికారుల తో సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ 12 రోజుల్లో చాలా అంశాలను పరిశీలించా. వైకాపా ప్రభుత్వ హయాంలో పోలీసు వ్యవస్థను నాశనం చేశారు. కేవలం బందోబస్తుకే వాడారు. ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. పోలీసు అకాడమీ, గ్రేహౌండ్ అకాడమీ లేదు. కేంద్రం నుంచి నిధులొచ్చినా పోలీసు అకాడమీ నిర్మాణం పూర్తిచేయలేదు. నేటికీ విశాఖపట్నం జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్ రేకుల షెడ్డులోనే నడుస్తోంది. ఎస్కార్ట్ వాహనాలు కూడా పనిచేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. 2014లో ఇచ్చినవే ఇప్పటికీ వాడుతున్నారు. ఠాణాల్లో స్టేషనరీ ఖర్చులకు కూడా గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని అన్నారు. గంజాయి రవాణా రాష్ట్రంలో బాగా పెరిగింది. నేషనల్ క్రైం రికార్డులో రాష్ట్రాన్ని మూడో స్థానంలోకి తెచ్చారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇప్పటికే ఉపసంఘం ఏర్పాటు చేశాం. 100 రోజుల ప్రణాళిక ఏ విధంగా అమలు చేయాలనేదానిపై చర్చిస్తాం. ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయిని అరికట్టేందుకు వీలుంటుంది. మంచి ఆలోచనతో పనిచేస్తే విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చు. ఎలాంటి శిక్షణ లేకుండా సచివాలయాల్లో మహిళా పోలీసులను పెట్టారు. ఏ విధంగా వారు పోలీసు విధులు చేయగలరు?వారిని ఏ విధంగా వినియోగించాలనేదానిపై ఆలోచన చేస్తున్నామని వివరించారు. కలిసి కట్టుగా పనిచేసి పోలీసుల పనితీరులో మార్పు తెస్తాం. ప్రజలు ధైర్యంగా స్టేషన్‌కు వెళ్లి బాధలు చెప్పుకొనేలా భరోసా ఇవ్వాలి. సిబ్బంది ప్రజలతో మర్యాదగా మెలగాలి. రాష్ట్రంలో ఆడపిల్లల అదృశ్యం ఘటనలు చాలా ఉన్నాయి. ఫిర్యాదులతో ఎవరైనా వస్తే వారిని కించపరిచేలా మాట్లాడవద్దు. పోలీసులు అంటే ప్రతిపక్ష పార్టీ నేతల అరెస్టులకే గత ప్రభుత్వం వినియోగించింది. ఇకపై ఫ్రెండ్లీ పోలీసింగ్ రావాలి. సోషల్ మీడియాలో నేటికీ నేను బాధితురాలినే. కొంతమంది ఐపీఎస్ అధికారుల తీరుతో వ్యవస్థకు చెడ్డపేరు వస్తోంది. గత ప్రభుత్వంలో అక్రమ కేసులు పెట్టారు. నాపైనే 23 కేసులు నమోదు చేశారు. అసభ్య పోస్టులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అక్రమ కేసులపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. పోలీసులంటే ప్రజల్లో ఒక నమ్మకం, గౌరవం తీసుకొస్తాం. ఏపీలో దిశ చట్టమే లేదు.. ఇక ఆ స్టేషన్ల పేరు కూడా మార్చే ఆలోచన చేస్తాంఅని హోం మంత్రి తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏడాదికి రూ. 50 కోట్లు చొప్పున రూ.250 కోట్లు పోలీసు శాఖకు రావాలని అన్నారు. ఈ ఐదేళ్లల్లో ఈ నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పుడు జీరో నుంచి తాము పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పేపర్, పెన్ను ఖర్చులకు కూడా గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని మండిపడ్డారు. నిధుల కొరత వల్ల పోలీసులకు విధుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో గంజాయి రవాణాను పోలీసులు నియంత్రణ చేయలేదని, గతంలో సిఐడీ ఎలా పని చేసిందో అందరూ చూశారన్నారు. హోంశాఖకు ఎంత నిధులు అవసరమో ఒక నివేదిక సిద్ధం చేశామని, ప్రాధాన్యత ప్రకారం కేటాయిస్తూ ప్రణాళికలు అమలు చేస్తామన్నారు.

నిధుల కొరత వల్ల ఒకేసారి అన్నీ చేయలేమని చెప్పారు. చాలా చోట్ల సిసి కెమెరాలు, ఫింగర్ ప్రింట్ స్కానర్‌లు పని చేయడం లేదని, వైసీపీ ప్రభుత్వం వాటిని అసలు పట్టించుకోలేదని అన్నారు. విశాఖలో సిపి కార్యాలయం తాకట్టులో ఉందని, ఎప్పుడు అప్పుల వాళ్లు వస్తారో తెలియదన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో 164 సీట్లు ప్రజలు ఇచ్చారని, మాకు రాష్ట్రం, ప్రజలే ముఖ్యమని.. వారి కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. ఇంకా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టులో ఉన్నాయన్నారు. పోలీసులు నిబంధనలు మేరకు పని చేయాలన్నారు. రాజకీయాలు కావాలంటే బయటకి వెళ్లి ఖద్దరు వేసుకోవాలని సూచించారు. పోలీసు అంటే ప్రజల కోసం పని చేసే వ్యవస్థ అనేలా పని చేయాలన్నారు. మహిళల మిస్సింగ్ కేసులపై దర్యాప్తు చేస్తామని, ఏపీలో ప్రతిఒక్కరూ భద్రతగా, భరోసాగా ఉండేలా చేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# జల్‌జీవన్‌పై డిప్యూటీ సిఎం పవన్ సమీక్ష

**మ్యాచింగ్ గ్రాంట్ వివరాలు ఇవ్వాలని ఆదేశం**



విజయవాడ,జూన్27: జల్‌జీవన్ మిషన్‌లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వివరాలు ఇవ్వాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం ఈ పథకం నిధులను వినియోగించుకోలేకపోయిందని వ్యాఖ్యానించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం.. తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల డయేరియా కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. తాగు నీటి సౌకర్యం లేని గ్రామాలపై దృష్టి పెట్టాలని, జల్‌జీవన్ మిషన్ పథకం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌పై స్పెషల్ ఫోకస్..

**కేంద్ర మంత్రితో పురంధేశ్వరి భేటీ..**

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఏపీ బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా.. ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి సారథ్యంలోని పలువురు నేతల బృందం ఢిల్లీలోని పలు శాఖల మంత్రులను కలిశారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా.. విశాఖ స్టీల్ ప్లాంట్ యాక్షన్ ప్లాన్‌పై పురంధేశ్వరి టీమ్ సుదీర్ఘంగా చర్చించింది. స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాటలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు.. అవసరమైన అంశాలతో కుమారస్వామికి వినతిపత్రం అందజేసింది పురంధేశ్వరి బృందం. ఇక.. ఏపీ బీజేపీ నేతల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కుమారస్వామి.. అధికారులతో చర్చించి రెండు నెలల్లో మరోసారి భేటీ అవుదామని చెప్పారు. అటు.. కుమారస్వామిని కలిసినవారిలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి, బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఉన్నారు.



# మాజీమంత్రి పెద్దిరెడ్డికి భారీ షాక్

**టిడిపిలో చేరిన పుంగనూర్ మున్సిపల్ ఛైర్మన్ బాషా**
**ఆయన వెంటే మరో 12 మంది కౌన్సిలర్ల జంప్**

తిరుపతి,జూన్27: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి భారీ షాక్ తగిలింది. పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ భాషతో పాటు 12 మంది మున్సిపల్ కౌన్సిలర్లు తెలుగుదేశంలో చేరారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు ఆధ్వర్యంలో చైర్మన్, కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో పుంగనూరు మున్సిపల్ కార్యాలయంపై టీడీపీ జెండా రెపరెపలాడనుంది. చల్లా రామచంద్రారెడ్డి వ్యూహం విజయవంతమైంది. మొత్తం 31 మంది సభ్యులు ఉన్న ఈ మున్సిపాలిటీలో మరో వారంలోపు మరి కొంత మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరికకు రంగం సిద్ధం చేశారు. వైఎస్ఆర్‌సీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చక్రం తిప్పిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఆయన పుంగనూరులో చాలా స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. వైసీపీ అధికారం కోల్పోవడంతో ఇప్పుడు పుంగనూరు వైసీపీ కార్యకర్తలు, నేతలు టీడీపీలో చేరిపోతున్నారు. పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడు అయిన పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ అలీమ్‌బాషాతోపాటు 12 మంది మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ చల్లా బాబు ఆధ్వర్యంలో వీరంతా టీడీపీ కండువాలు కప్పుకున్నారు. మొత్తం 31 మంది సభ్యులు ఉన్న మున్సిపాలిటీలో 25 మందికి పైగా కౌన్సిలర్లు టీడీపీలో చేరికకు రంగం సిద్ధం అయినట్లుగా టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. పుంగనూరు నుంచి వరుసగా గెలుస్తూ వస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గాన్ని కంచుకోటగా మార్చుకున్నారు. ప్రత్యర్థి నేత ఎవరైనా సరే దాడులకు గురవ్వాల్సిందే. 2019లో టీడీపీ తరపున పోటీ చేసిన అనీషా రెడ్డి వేధింపులను భరించలేక కన్నీరు పెట్టుకుని రాజకీయాలకు దూరమయ్యారు. ఆ తర్వాత చల్లా రామచంద్రారెడ్డి ఇంచార్జ్ గా బాధ్యతలు తీసుకుని టీడీపీ కోసం పని చేశారు. ఆయన ఎన్నోసార్లు దాడులకు గురయ్యారు. అలాగే భారత చైతన్య యువజన పార్టీ పెట్టుకున్న మరో నేత బోడె రామచంద్రయాదవ్ పైనా అనేక సార్లు దాడులు జరిగాయి. ఇక చంద్రబాబుపై అంగళ్లు వద్ద రాళ్ల దాడి జరిగిన తర్వాత పుంగనూరు లోకి వచ్చే క్రమంలో ఆయనపై మరోసారి దాడి చేశారు. ఇలాంటి దాడులతో పుంగనూరులో మరొకరు అడుగు పెట్టకుండా చూసుకునేవారన్న విమర్శలు ఉన్నాయి. అయితే ఎన్నికల తర్వాత సీన్ మారిపోయింది.

# సిఎస్ నీరబ్ కుమార్ సర్వీసు పొడిగింపు


**ప్రభుత్వ అభ్యర్థను కేంద్రం అంగీకారం**
**మరో ఆరు నెలలపాటు ఆయనే ప్రభుత్వ కార్యదర్శి**




అమరావతి,జూన్27: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలం పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరో 6 నెలలు పొడిగించాలంటూ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇటీవలే కేంద్రానికి లేఖ రాశారు. ఈ లేఖను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం నీరబ్ కుమార్ పదవీకాలాన్ని పొడగించింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ గురవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఈ నెలాఖరుకు నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీవిరమణ చేయాల్సి ఉంది. తాజా ఉత్తర్వులతో ఆయన మరో ఆరు నెలలు ఈ పదవిలో ఉండనున్నారు. ఆయన పదవీ కాలం జులై 1 నుంచి డిసెంబర్ 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్ర సీఎస్‌గా నీరభ్ కుమార్ జూన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తుండడంతో ఇటీవల ప్రభుత్వం ఆయన సర్వీసు పొడిగించాలని కేంద్రానికి లేఖ రాసింది. ప్రభుత్వ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్రం ఆయన పదవీ కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సమాచారం ఇచ్చింది. నీరభ్ కుమార్ ప్రసాద్ సీఎస్ కావడానికి ముందు రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1988లో ప.గో జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. 1990లో తూ.గో సబ్ కలెక్టర్, 1991లో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో, 1992లో కృష్ణా జిల్లా పీడీ ఆర్డీఏగా పనిచేశారు. 1993లో కృష్ణా జిల్లా జేసీగా, 96లో ఖమ్మం కలెక్టర్‌గా, 98లో చిత్తూరు కలెక్టర్‌గా సేవలందించారు. 1999లో యువజన సంక్షేమ శాఖ డైరెక్టర్, శాప్ ఎండీగా పనిచేశారు. 2000వ సంవత్సరంలో డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లారు. 2005లో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి ఎండీగా, 2007లో పరిశ్రమల శాఖ కమిషనర్‌గా, 2009లో మత్స్యశాఖ కమిషనర్‌గా సేవలందించారు. 2012లో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2014లో జీఏడీ ముఖ్య కార్యదర్శిగా, 2015లో వైటీసీఏ ముఖ్య కార్యదర్శిగానూ విధులు నిర్వర్తించారు. 2017లో కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు.

# చిన్నారికి పేరు పెట్టిన సీఎం చంద్రబాబు

కుప్పం,ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి కొలువుదీరడంతో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఎనిమిదో సారి కుప్పం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు నాలుగో సారి సీఎంగా బాధ్యతలు



చేపట్టాక కుప్పంలో తొలి పర్యటన నిర్వహించారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో ప్రజలతో మమేకమయ్యారు. రెండు రోజుల పర్యటనలో స్థానికులు, నియోజకవర్గ ప్రజలతో కలిసిపోయారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా చంద్రబాబు చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటించారు. కుప్పంలో ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు సీఎం పాదాభివందనం తెలిపారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తుండగా.. శాంతిపురం మండలానికి చెందిన సుధాకర్, ప్రియ దంపతులు చంటి బిడ్డతో వచ్చారు. తమ రెండో కుమారైకు నామకరణం చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. వెంటనే ఆ పాపను చంద్రబాబు చేతులలోకి తీసుకున్నారు.ముద్దులొలికే చిన్నారిని చేతుల్లోకి తీసుకున్న చంద్రబాబు 'చరణి' అని పేరు పెట్టారు. తమ బిడ్డకు సాక్ష్యాత్తూ సీఎం పేరు పెట్టడంతో తల్లి ఆనందంతో పొంగిపోయారు. సీఎం చేత నామకరణం చేయించిన తల్లిదండ్రుల సంతోషానికి అవధుల్లేకుండాపోయాయి.

# సంపాదకీయం

శుక్రవారం 28-06-2024

## కేసీఆర్, జగన్ లకు ఇగో అడ్డు..

ప్రజాస్వామ్యంలో అధికారపక్షం.. ప్రతిపక్షం రెండూ ముఖ్యమే. పాలన వ్యవహారాలను చూసేది అధికార పక్షం.. పాలకుల లోపాలను ఎత్తి చూపుతూ.. ప్రజా సమస్యలపై పోరాడేది ప్రతిపక్షం. ప్రతిపక్షం ఎంత బలంగా ఉంటే.. అధికార పక్షం అంత బాగా పనిచేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. అధికార పక్షాన్ని పనిచేయించేది ప్రతిపక్షమే. అయితే.. కొన్నేళ్లుగా ప్రతిపక్ష పాత్ర ప్రశ్నార్థకమవుతోంది. ప్రజాతీర్పు అపహాస్యమవుతోంది. ప్రతిపక్షంలో కూర్చోవాలని ప్రజలు ఇచ్చిన తీర్పును కాదని.. విపక్ష ప్రజాప్రతినిధులు కూడా అధికార పక్షంలో చేరిపోతున్నారు. దీంతో బలహీనమైన ప్రతిపక్షం కారణంగా అధికార పక్షాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా తెలంగాణలో కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇద్దరూ ఆరు నెలల వ్యవధిలో అధికారం కోల్పోయారు. ప్రతిపక్షానికి పరిమితమయ్యారు. అయితే ఇద్దరు మిత్రులు ప్రతిపక్షంలో కూర్చోలేకపోతున్నారు. తెలంగాణలో కేసీఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. పదేళ్లు.. విపక్షం ఉండొద్దు అన్నట్లు వ్యవహరించారు. ఇతర పార్టీల్లో గెలిచిన ఎమ్మెల్యేలను కూడా బీఆర్ఎస్‌లో చేర్చుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. తనకు ఎదురు చెప్పేవారు.. తనను ప్రశ్నించేవారు ఉండకూడదన్న ఉద్దేశంతో ఇలా చేశారు. ప్రతిపక్షం అంటేనే ప్రశ్నించడం.. కానీ కేసీఆర్‌కు నచ్చనిది కూడా అదే. దీంతో పదేళ్లు కాంగ్రెస్ ప్రతిపక్షానికి పరిమితమైనా.. నయానో భయానో విపక్ష నేతలను తన పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడు కేసీఆర్ పరిస్థితి ప్రతిపక్షానికి పరిమితమైంది. తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడిచినా? ప్రతిపక్ష స్థానంలో కూర్చోవడానికి కేసీఆర్‌కు అహం అడ్డు వస్తోంది. ఇప్పటి వరకు రెండుసార్లు సభ నిర్వహించినా కేసీఆర్ మాత్రం విపక్ష స్థానంలో కూర్చోలేదు. కేసీఆర్ అసెంబ్లీకి రాడని తెలిసినా తెలంగాణలో 39 స్థానాలు గెలిచిన బీఆర్ఎస్ పార్టీ.. మాజీ ముఖ్యమంత్రినే తమ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. అసెంబ్లీ సమావేశాలకు మాత్రం ఆయన దూరంగానే ఉంటున్నారు. దీంతో అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావే ప్రతిపక్ష నేత పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కేసీఆర్‌కు ఇప్పుడు ఇది కూడా మింగుడు పడడం లేదు. తాను మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉన్నారు. నాడు ఓటుకు నోటు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుతోపాటు రేవంత్‌రెడ్డిని ఇరికించారు. రేవంత్‌రెడ్డిని జైల్లో పెట్టారు. అనేక విధాలుగా వేధించారు. ఈ క్రమంలో ఇప్పుడు సీఎం హోదాలో ఉన్న రేవంత్ ముందు విపక్ష నేతగా కూర్చోవడానికి ఇష్టపడడం లేదు. ఇక ఏపీలో మొన్నటి వరకు 151 సీట్లతో అధికారంలో ఉన్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం 11 సీట్లకే పరిమితమయ్యారు. వై నాట్ 175 నినాదంతో జగన్ సారథ్యంలో ఎన్నికల బరిలో దిగిన వైసీపీని ఆంధ్రా ఓటర్లు చిత్తుగా ఓడించారు. 11 అసెంబ్లీ, 4 లోక్‌సభ స్థానాలకు పరిమితం చేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి.. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినా.. వైసీపీని ప్రజలు ఆదరించకపోవడం జగన్‌కు మింగుడు పడడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌తోపాటు పలువురు సీనియర్ నేతలు జగన్ సర్కార్ అనేకరకాలుగా వేధించింది. అసెంబ్లీ సాక్షిగా జగన్ సర్కార్ విపక్ష నేత చంద్రబాబును తీవ్రంగా అవమానించింది. ఆయన సతీమణిపై వైసీపీ మంత్రులు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఏడాదిలో జగన్ విపక్ష నేత చంద్రబాబును స్కిల్ స్కాం కేసులో జైల్లో పెట్టారు. వీటి ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. రాష్ట్ర విభజన తర్వాత జరిగిన ఎన్నికల్లో జగన్ సారథ్యంలో వైసీపీ విపక్షానికే పరిమితమైంది. నాడు 67 స్థానాల్లో గెలిచింది. విపక్షంగా కీలక పాత్ర పోషించింది. జగన్ కూడా అసెంబ్లీ అనుభవాలతో మంచి పరిణతి చెందారు. విపక్ష నేతగా కీలక పాత్ర పోషించారు. తర్వాత 2019 జరిగిన ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ పేరుతో ఎన్నికల్లో పోటీచేసిన వైసీపీకి ఆంధ్రా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 151 ఎమ్మెల్యే, 22 ఎంపీ సీట్లు ఇచ్చారు. దీంతో అధికారంలోకి వచ్చిన జగన్.. సంక్షేమం పేరుతో డబ్బులు పంచడం మినహా ఎలాంటి అభివృద్ధి చేయలేదు. అమరావతి రాజధానిని రద్దు చేసి మూడు రాజధానుల అంశం తెరపైకి తెచ్చారు. ఫలితంగా వైసీపీ 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకు పరిమితమైంది. దీంతో చంద్రబాబు ముందు కూర్చొనే పరిస్థితి లేకుండా పోయింది. 2014 నుంచి 2019 వరకు విపక్షంలో కూర్చున్న జగన్.. ఇప్పుడు మళ్లీ ప్రతిపక్ష హోదా లేకుండా ఓడిపోయారు. దీంతో అసెంబ్లీలో కూర్చోవడానికి ఆయనకు ఇగో అడ్డు పడుతోంది. దీంతో ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వాలని స్పీకర్‌కు లేఖ రాశారు. అయితే దీనిపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. క్రమంలో ఆయన కూడా అసెంబ్లీకి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయంటున్నారు విశ్లేషకులు.

# వర్కౌట్ అయిన సోషల్ ఇంజనీరింగ్

కాకినాడ, జూన్ 27, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ సోషల్ ఇంజినీరింగ్ మంచి ఫలితాలను ఇచ్చింది. మంత్రి వర్గ విస్తరణలో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన శెట్టిబలిజ కులానికి చెందిన వాసంశెట్టి సుభాష్‌కు మంత్రి పదవి దక్కింది. అమలాపురంకు చెందిన ఈయన అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం నుంచి గెలుపొందారు.. తొలి సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సుభాష్‌కు మంత్రి పదవి దక్కింది. ఆయన టీడీపీకి దూరమైన శెట్టిబలిజల్ని దగ్గరకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. బీసీ ఉపకులాల్లో ఒకరైన శెట్టిబలిజ కులస్తులు టీడీపీ ఆవిర్భావం నుంచి టీడీపీ వెంట నడిచిన వారే. అయితే మెల్లగా మారిపోయారు. గత 20 ఏళ్లుగా వీరిలో ఎక్కువ శాతం మంది అప్పట్లో కాంగ్రెస్ వెంట నడిచారు. రాష్ట్ర విభజన తరువాత ఏర్పడ్డ వైఎస్సార్ సీపీ వెంట నడిచారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత వీరాభిమానులు శెట్టిబలిజ వర్గంలోని పెద్దలు చాలా మంది ఉన్నారని చెబుతారు.. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటే ఎక్కువ శాతం మంది నడిచారు..ఉభయగోదావరి జిల్లాలో ఎక్కువగా ఉన్న శెట్టిబలిజ కులాన్ని ప్రసన్నం చేసుకునేందుకు వైసీపీ ప్రభుత్వంలో కూడా పెద్దపీట వేసిన పరిస్థితి ఉంది.. ఈ క్రమంలోనే రామచంద్రపురం నియోజకవర్గం నుంచి తొలిసారి గెలిచిన చెల్లుబోయిన గోపాలకృష్ణకు మంత్రి పదవిని కట్టబెట్టింది. ఆ తరువాత ఎమ్మెల్సీ పదవుల కేటాయింపులో అమలాపురంకు చెందిన శెట్టిబలిజ కుల నాయకుడు కుడిపూడి సూర్యనారాయణరావుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నా శెట్టిబలిజ కులంలో కులం పేరు చెప్పి కొంత మందే పదవులు పొందుతున్నారు కానీ దిగువ క్యాడర్‌కు అన్యాయమే చేసిందని అసంతృప్తి వ్యక్తమయింది. దీనికి తోడు బీసీలకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్న వాదన బలంగా వినిపించడంతో అనూహ్యంగా శెట్టిబలిజ కులస్తులు కూడా క్రమక్రమంగా పార్టీకు దూరమవుతూ కనిపించింది. ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధికంగా ఉన్న కాపులు, శెట్టిబలిజలు ఒక్కటవ్వాలన్న నినాదం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చాలా సారు వారాహి సభల వేదికగా అనేక సార్లు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడ్డాక ఈ నినాదంకు మరింత బలం చేకూరింది.. వైసీపీపై తీవ్ర అసంతృప్తిలో ఉన్న చాలా మంది శెట్టిబలిజ ద్వితీయశ్రేణి నాయకత్వం టీడీపీలోకి చేరింది.. ఈ మార్చే 2024 ఎన్నికల్లో కాపులు, శెట్టిబలిజలు ఏకమై కూటమి గెలుపులో కీలకంగా పనిచేసిన పరిస్థితి కనిపించింది...అమలాపురం అల్లర్లులో కేసుల్లో ఇరుక్కున వారు ఎక్కువ మంది కాపులు, శెట్టిబలిజలు కావడంతో వీరు ఆసంఘటన నుంచి కలిసే ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆ తరువాత ఈ కేసుల్లో కొందరు అమాయకులు బలి అయ్యారని నష్ట నివారణ చర్యలు చేపట్టిన వైసీపీకు తిరిగి ఆ నష్టం మాత్రం పూడ్చలేని పరిస్థితి ఏర్పడింది.. శెట్టిబలిజ యూత్ ఫోర్స్ కన్వీనర్‌గా ఉన్న ప్రస్తుత కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్, కాపు నాయకుడు గంధం పళ్లంరాజులు మధ్య ముందు నుంచి ఉన్న స్నేహం ఈ రెండు వర్గాలను కలపడంలో ప్రధాన భూమిక పోషించిందని చెప్పాలి. రామచంద్రాపురంలో స్థానికుడు కాకపోయినా కూటమి తరపున బరిలో దిగిన వాసంశెట్టి సుభాష్‌ను ప్రధానంగా కాపు, శెట్టిబలిజ సామాజికవర్గాల కలయిక మంచి మెజార్టీతో గెలుపొందేలా చేసింది.. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ జయహో బీసీ సదస్సులు పేరిట నిర్వహించిన కార్యక్రమంలో శెట్టిబలిజ వర్గాలకు పెద్దపీట వేయడంతో మరింత జోష్ పెరిగి టీడీపీ వైపు మళ్లేలా చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు.. ఈ జోష్ కూటమి గెలుపుకు మరింత బలాన్ని చేకూర్చిందంటున్నారు.. ఈ ఎన్నికల్లో కూటమి భారీ విజయంలో కాపు, కమ్మ సామాజికవర్గాల కాంబినేషన్ ఎంతటి సక్సెస్‌ను ఇచ్చిందో ఉభయగోదావరి జిల్లాల్లో కాపు, శెట్టిబలిజ కాంబినేషన్ కూడా అంతే సూపర్ హిట్ అయ్యిందని విశ్లేషకులు చెబుతున్నమాట. బలమైన సామాజికవర్గంలో ఒకటైన శెట్టిబలిజ వర్గంలో అత్యధికశాతం టీడీపీ వైపుకు మళ్లడం మాత్రం వైసీపీకు చాలా నష్టాన్నే మూటగట్టిందని మాత్రం స్పష్టం అవుతుందంటున్నారు..

# స్వరూపుడి లీలలు...ఇంతింతకాదయా

విశాఖపట్టణం, జూన్ 27, హిందూ ధర్మ రక్షణ, ధర్మ ప్రచారం, వేద విద్య.. ఇవీ అధ్యాత్మిక పీఠాల కర్తవ్యం.. శారదా పీఠం కూడా ఇందుకు అతీతం కాదు.. కానీ ప్రస్తుతం ఈ పీఠం పెద్దల్లో అధ్యాత్మిక భావన కంటే వాణిజ్యకోణాలే ఎక్కువ కనిపిస్తున్నాయన్న ఆరోపణలు మొదలయ్యాయి. గత ప్రభుత్వ పెద్దలను అడ్డుగా పెట్టుకొని దేవుడి పేరు చెప్పుకొని అక్రమార్జన చేశారన్న ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఇంతకీ ఏంటీ శారదపీఠం కథ.. ? వారిపై వస్తున్న ఆరోపణలేంటి? స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి.. విశాఖ శారదాపీఠం అధిపతి.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన స్వామిజీ.. స్వరూపానందేంద్ర.. అయితే ఆ సమయంలో ఎంత పేరు వచ్చిందో.. ఇప్పుడు అంతకంటే ఎక్కువ వివాదాలను ఎదుర్కొంటున్నారు. కారణం ఆ పీఠం దక్కించుకున్న భూములు.. వారికున్న పొలిటికల్ లింక్స్.. ఇంతకీ వివాదం ఏంటంటే.. వైసీపీ హయాంలో శారదా పీఠానికి ప్రభుత్వం భారీగా భూములు కేటాయించింది. విశాఖలో వేద పాఠశాల ఏర్పాటు కోసం శారదాపీఠం భూమిని కోరింది. కోరింది స్వరూపానందేంద్ర.. అధికారంలో ఉంది శిష్యుడు జగన్.. ఇంకేముంది ఎకరం మూడు కోట్లు విలువ చేసే భూమిని కేవలం లక్ష రూపాయల చొప్పున 15 ఎకరాల భూమిని కేటాయించింది. అంటే 45 కోట్ల విలువైన భూమిని.. 15 లక్షలకు కేటాయించింది. భీమిలి బీచ్‌కి సమీపంలోని సర్వే నెంబరు 102,103లో ఈ 15 ఎకరాల భూమి ఉంది. ఇక్కడి వరకు బాగానే ఉంది. స్వామి స్వరూపానంద సరస్వతికి మేలు చేయడం కోసం 15 ఎకరాల భూమికి సమీపంలో ఎఓఖీఆంకు 50 ఎకరాలు కేటాయించింది ప్రభుత్వం.. ఆ 50 ఎకరాల భూమి అభివృద్ధి పేరుతో శారదాపీఠానికి కేటాయించిన భూమికి సమీపంగా రోడ్లు డెవలప్ కూడా చేశారు. అంటే ఇన్‌డైరెక్ట్‌గా ఎఓఖీఆం నిధులతో శారదాపీఠం స్వామివారికి ప్రత్యేక రోడ్లు.. మౌలిక వసతులు కల్పించింది జగన్ ప్రభుత్వం. మరి ఈ కేటాయింపులు అక్కడితో ఆగిపోయాయా? లేదు.. భీమిలిలో సముద్ర సమీపంలో ఒకచోట..అమరావతిలో యాగం చేసిన ప్రదేశానికి సమీపంలో మరోచోట.. ప్రకాశం జిల్లాలో ఇంకోచోట.. తిరుపతి, తిరుమలలో రెండు చోట్ల భూములను కేటాయించింది జగన్ ప్రభుత్వం. సో మొత్తంగా చూసుకుంటే వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా ల్యాండ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకుంది శారదాపీఠం. ఇక తిరుమల విషయానికి వద్దాం.. తిరుమలలో ధర్మ పరిరక్షణ పేరుతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపడుతుంది శారదాపీఠం.. అయితే ఈ నిర్మాణాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తుందన్నది ఆరోపణలు. వడ్డించేవాడు మనవాడైతే.. పంక్తిలో ఎక్కడ కూర్చున్న పర్వాలేదన్నట్టుగా.. ఇన్నాళ్లు ఈ అక్రమాలను చూసి కూడా చూడనట్టుగా వదిలేసింది తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు పెద్దలు.. ఏ బ్లాక్‌లో నిర్మాణాలకు పర్మిషన్ తీసుకున్నది నాలుగు అంతస్తులకు నిర్మించింది ఐదు అంతస్థులు. ఇదే విషయంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు తిరుమల క్షేత్ర రక్షణ సమితి అధ్యక్షుడు ఓంకార్.. హైకోర్టు పిటిషన్‌పై విచారణ చేసి కమిషన్ ఏర్పాటు చేయడం.. ఆ కమిషన్ విచారణ చేపట్టడం.. ఆ విచారణలో అక్రమాలు బయటపడటం.. ఇలా వరుసగా జరిగిపోయాయి. అసలు ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండానే నిర్మించడం ఓ తప్పైతే.. ఊట కాలువను పూడ్పించి మఠము వెనుక రహదారి వైపు నిర్మించడం మరో తప్పు.. ఇదీ తిరుమల కథ. విశాఖలో గత ప్రభుత్వంలో ఇచ్చిన విలువైన భూములను కొత్త ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కోట్ల విలువైన భూములను స్వామిజీకి ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. అయితే.. ప్రభుత్వం ఇచ్చిన భూములను వెంటనే వెనక్కి తీసుకోవాలి.. అదే మా డిమాండ్ అంటూ క్లియర్ కట్‌గా చెప్తున్నారు. అసలు శారదపీఠం ఆస్తులు ఈ ఐదేళ్లలో ఎందుకు గణనీయంగా పెరిగాయి? ఎలా పెరిగాయి? దీని వెనకున్నది ఎవరు? అనేది తేల్చాలన్న డిమాండ్ కూడా వినిపిస్తుంది. మొత్తంగా చూసుకుంటే శారదాపీఠం ఇప్పుడు వివాదాలకు కేరాఫ్‌గా మారింది. మరి ప్రభుత్వం వీటిపై ఫోకస్ చేస్తుందా? త్వరలోనే విచారణ జరిపి.. ఇచ్చిన భూములను వెనక్కి తీసుకుంటుందా? ఈ ప్రశ్నలకు సమాధానం త్వరలోనే రానుంది.

# ఉచిత రవాణా హామీ పై చంద్రబాబు సర్కార్ దృష్టి

విజయవాడ, జూన్ 27, ఏపీలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం హామీల అమలు దిశగా అడుగులు వేస్తోంది. సూపర్ సిక్స్ లోని మహిళలకు ఉచిత రవాణా హామీ పై చంద్రబాబు సర్కార్ దృష్టి సారించింది. కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు కుప్పం ఆర్టీసీ బస్టాండు, డిపో ఆధునీకరణ పనులకు ఆదేశించారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కుప్పంలో ఆర్టీసీ కొత్త బస్సులను ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో పరిస్థితిని అధ్యయనం చేస్తామన్నారు .లోటుపాట్లను గుర్తించి ఏపీలో పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి. వైసీపీ నేతలు ఆర్టీసీ స్థలాలు దోచుకున్నారన్న ఆరోపణలపై విచారణ జరుగుతోందన్నారు మంత్రి రాంప్రసాద్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూస్తామన్నారు. కుప్పం బస్టాండ్, డిపో ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 5 కొత్త బస్సులను ప్రారంభించారు. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు రావడంతో సుమారు 30 బస్సులు కుప్పం డిపోకు వచ్చాయన్నారు. గత ప్రభుత్వం ఏ శాఖను వదల్లేదని విమర్శించారు మంత్రి రాంప్రసాద్. 5 ఏళ్లలో ఎన్ని వీలైతే అన్ని విద్యుత్ బస్సులు తీసుకొస్తామన్న మంత్రి ప్రభుత్వంలో ఏపీఎస్ ఆర్టీసీని 100 శాతం విలీనం చేసేందుకు కృషి చేస్తామన్నారు. డిజల్ రేట్స్ తగ్గినా బస్సు చార్జీలను పెంచిన ఘనత గత ప్రభుత్వానిది అంటూ విమర్శించారు. జగన్ మాటలను ప్రజలు వినే పరిస్థితి లేదని అన్నారు. రాజకీయ పార్టీల సభలకు ఆర్టీసీ బస్సుకు ఫ్రీగా వాడమన్నారు మంత్రి రాంప్రసాద్.

# త్యాగరాజులకే మొదట పదవులు

విజయవాడ, జూన్ 27, (న్యూస్ పల్స్) అవును.. ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే గెలిచిన వాళ్లు సరే. ఎన్నికల్లో టిక్కెట్లు పొంది ఓటమి పాలయిన వాళ్లు సరే. కానీ త్యాగాలు చేసిన తమ్ముళ్ల మాటేమిటి? అన్న చర్చ ఇప్పుడు పార్టీలో జోరుగా సాగుతుంది. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఒంటరిగా పోటీ చేసింది. 175 స్థానాల్లోనూ తన అభ్యర్థులను పోటీకి దింపింది. అయితే 2024 ఎన్నికల నాటికి మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జగన్ ను ఒంటరిగా ఎదుర్కొనే సాహసం చేయలేని విపక్షాలు కలసి పోరాటం చేయాలని నిర్ణయించాయి. అందుకే ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు కలసి పోటీ చేశాయి. ఈ కాంబినేషన్ సూపర్ హిట్ అయింది. 2014 నాటి ఎన్నికల తరహాలోనే 2024లోనూ కూటమి పార్టీల విజయం మాత్రం ఆశించిన దానికంటే ఎక్కువగా వచ్చింది. అయితే కూటమి ఏర్పడినప్పుడు ఇబ్బంది పడింది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే. ఎందుకంటే మిత్రపక్షంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి తట్టి చూసినా నియోజకవర్గాల్లో పెద్దగా నాయకత్వం లేదు. సో.. దానికి ఇబ్బంది లేదు. ఇక జనసేన కూడా కేవలం కొన్ని స్థానాలు.. అదీ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలకు మాత్రమే పరిమతమయిన పార్టీగా పేరుండటం, అక్కడే ఆ పార్టీకి నేతలు ఎక్కువగా ఉండటం వల్ల అది కూడా పెద్దగా సీట్ల పంపకంలో పెద్దగా ఇబ్బంది పడలేదు. దీంతో పాటు పవన్ కల్యాణ్ హండ్రెడ్ పర్సెంట్ సక్సెస్ రేట్ కావాలని తక్కువ స్థానాలకే పరిమితమయినా.. అక్కడక్కడా తప్ప పెద్దగా అసంతృప్తులు మాత్రం కనిపించలేదు. పవన్ కల్యాణ్ పెద్దగా లెక్క కూడా చేయలేదు. ఇక బాగా ఇబ్బంది పడింది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు మాత్రమే. ఒకరకంగా పొత్తు ధర్మ పాటించాల్సి రావడం, మిత్రపక్షాలకు సీట్లు కేటాయించాల్సి రావడంతో కొంత నలిగిపోయారని చెప్పకతప్పదు. మొత్తం మీద చంద్రబాబు 21అసెంబ్లీ స్థానాలను జనసేన పార్టీకి, 10 స్థానాలను బీజేపీకి కేటాయించారు. అంటే 31 స్థానాల్లో టీడీపీ ఇన్‌ఛార్జులకు ఇబ్బంది వచ్చింది. వారిని కావాలని ఇబ్బంది పెట్టలేదు. కానీ పరిస్థితులు అలా వచ్చాయి. గెలుపు కావాలన్నా, పార్టీ అధికారంలోకి రావాలన్నా త్యాగానికి సిద్ధం అవ్వాలని చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు నేతలు పాజిటివ్ గానే స్పందించారు. అక్కడక్కడా ఒకరిద్దరు నేతలు మినహాయించి అందరూ కూటమి పార్టీల నేతల విజయానికి సహకరించారు. పెద్దగా అసంతృప్తులు లేకుండానే పొత్తుల పంపకం సాగిపోయింది. సాఫీగా ఎన్నికల ప్రక్రియ ముగిసింది. విజయం సాధ్యమయింది. ఇక త్యాగాలు చేసిన తమ్ముళ్లకు ఏదో ఒక పనిని అప్పగించాల్సిన అవసరం పార్టీ అధినేతగా చంద్రబాబు పై ఉంది. దానిని ఎవరూ అభ్యంతరం కూడా చెప్పరు. అందుకు కారణం సీట్లు దక్కని చోట కూడా గట్టిగా కూటమి అభ్యర్థుల విజయానికి కృషిచేసినట్లే. అందుకే చంద్రబాబు ఆ 31 మందికి ఏదో ఒక పదవులు ఇవ్వాలని నిర్ణయించనట్లు తెలిసింది. ఓడిపోయిన 11 మందిని పక్కన పెడితే.. 31 మందికి మాత్రం పదవుల పంపకాల్లో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. పార్టీ పదవులో లేకుంటే ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులు ఇచ్చి టిక్కెట్ దక్కని వారిని సంతృప్తి పర్చాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారని తెలుస్తోంది. అయితే కొంత పాలన గాడిలో పడిన తర్వాత ఆ 31 మందికి పదవులను ఇచ్చే విషయంపై చంద్రబాబు దృష్టి పెడతారని చెబుతున్నారు. భవిష్యత్ లో శాసనమండలి, రాజ్యసభలో ఖాళీ అయ్యే పదవులతో పాటు నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్న ఆలోచనతో చంద్రబాబు ఉన్నట్లు తెలిసింది. మొత్తం టిక్కెట్ రాని ఆ 31 మంది మాత్రం మోస్ట్ లక్కీ ఫెలోలంటూ పార్టీ నేతలు కూడా అంటున్నారు.

# ట్విట్టర్ వార్...

విజయవాడ, జూన్ 27, పచ్చ కామెర్ల వాడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది అన్నట్టు ఉంది వైసీపీ తీరు అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా కట్టిన పార్టీ ఆఫీసులకి, అనుమతులతో కట్టిన రాష్ట్ర పార్టీ ఆఫీసుకు తేడాలేదా అంటూ నెటిజన్స్ మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి నారా లోకేష్ పై వైసీపీ కీలక నేత, మాజీమంత్రి పేర్ని నాని ట్విట్టర్ వేదికగా స్పందించారు.'నారా లోకేష్ నువ్వు పిల్లాడిగా ఉన్నప్పుడు మీ నాన్న హైదారాబాద్ లో కట్టించిన పార్టీ ఆఫీస్ ఏంటి ఇది పూరిపాక, రేకుల షెడ్డా లేదంటే ఒకే గది ఉన్న స్లాబా.. దీని చరిత్ర ఏంటి? ఈ పార్టీ ఆఫీస్ స్థలాన్ని ట్రస్ట్ కి బదిలీ చేసుకున్నారు రెగ్యులరైజ్ కూడా చేసుకున్నారు.. 2019 ఎన్నికలకు వెళ్ళే నెల ముందు జనవరిలో కూడా 3 ఆఫీసులకి స్థలం లీజుకి తీసుకున్నారు.' అంటూ టీడీపీ ఆఫీస్ ఫోటో షేర్ చేశారు. పేర్ని నాని ట్వీట్‌కు టీడీపీ ఘాటుగా స్పంధించింది. 'వైఎస్ జగన్ నువ్వు పదో తరగతిలో లాగులు వేసుకునే టైంలో, ప్రశ్నాపత్రాలు దొంగతనం చేసి దొరికిపోయావు. నీ స్నేహితులు చక్కగా చదువుకుని బాగుపడ్డారు. నువ్వు మాత్రం ఘరానా దొంగవి అయ్యావు. నీకు, నీ స్నేహితులకు ఎంత తేడా ఉందో, మేము అనుమతులతో కట్టిన రాష్ట్ర పార్టీ ఆఫీసుకు, నువ్వు అనుమతులు లేకుండా, అక్రమంగా, కబ్జా చేసి, ప్రజల డబ్బుతో, 26 జిల్లాల్లో కట్టిన 26 ప్యాలెస్‌లకు అంత తేడా ఉంది.' అంటూ టీడీపీ మండిపడింది. కాగా ఈ పోస్టులు చూసిన నెటిజన్స్ వైసీపీపై మండిపడుతున్నారు. పేర్ని నాని పోస్టుపై నెటిజన్స్ మండిపడుతున్నారు. టీడీపీ అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఇప్పుడు గగ్గోలు పెడుతున్న వైసీపీ నేతలు, అధినేత అధికారంలో ఉండగా ఎందుకు నోరు మెదపలేదు..? అనుమతులతో కట్టిన, ప్రజలకు ఉపయోగకరమైన ప్రజా వేదికను కూల్చినప్పుడు, అనుమతులు లేని పార్టీ ఆఫీసుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అని ప్రశ్నిస్తున్నారు. అలానే నాడు మాట్లాడకుండా మౌనంగా ఉన్న మీరు నేడు మాట్లాడుతున్నారంటే.. టీడీపీపై వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తమకు అర్ధం అవుతుందని, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబుపై బురదజల్లేందుకు మీరు చేస్తున్న ప్రయత్నం వర్ధ్యం అని వైసీపీని ప్రజలు నమ్మడంలేదని నెటిజన్స్ తేల్చి చెప్పారు.

# భీమేశ్వర స్వామి ఆలయంలో అవినీతి జరిగింది

కోనసీమ,ద్రాక్షారామనీ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజాద ర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు దేవస్థానం ఆలయ ఈవో తారకేశ్వరరా వు,ఇద్దరు సిబ్బందిపై పలు అవినీతి ఆరోపణలు చేసారు. ఆలయానికి పిలిచే టెండర్లు, ఆలయ ప్రాంగణం లో దుకాణాలు యాజమా నుల నుంచి భారీ మొత్తం సొమ్ములు వసూలు చేసి స్వాహా చేశారని పలు వురు పిర్యాదుచేసారు. దాతలు ఇచ్చిన సొమ్ముతో రథాన్ని తయారు చేసి మాజీ మంత్రి వేణు పేరు శిలాఫల కం పై ఎలా వేశారు అంటూ ఇవో ను మంత్రి నిలదీసారు. రథం నేనే నిర్మిస్తానని చెప్పి వేలకోట్లు మాజీ మంత్రి వేణు దండుకున్నారని అయన ఆరోపించారు. మాజీ మంత్రి వేణు ఇంట్లో జరిగే ప్రతి కార్యక్రమానికి దేవస్థానం వంటశాల నుంచే ఆహారపదార్థాలు సరఫరా చేసారని ఇవో ను మంత్రి నిలదీసారు. మంత్రి మాట్లాడుతూ భీమేశ్వరస్వామి ఆలయాన్ని అధికారులు అవినీతి మయం గా మార్చేసారు. ఆలయ అవినీతి పై విజిలెన్స్ కు పిర్యాదు చేశా. విచారణ జరుగు తుంది. అవినీతి నిర్మూలన ద్రాక్షారామ నుంచే శ్రీకారం చుట్టా. రామచంద్రపురం నియోజవర్గం లో అవినీతి జరిగితే ఉపేక్షించేదిలేదని అన్నారు.

# నెల్లూరు సెంట్రల్ జైల్ కి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

నెల్లూరు,ఈవీఎంల ధ్వంసం కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు. గురువారం ఉదయం 8.50 కి జైల్ లోకి తరలించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. నంబూరి శేషగిరి రావు పై దాడి, కారంపూడి సిఐ నారాయణ స్వామిపై దాడి కేసుల్లో పిన్నెల్లికి రిమాండ్ విధంచారు. పిన్నెల్లిని పోలీసులు మాచెర్ల నుంచి పిన్నెల్లిని ఉదయం నెల్లూరుకు తరలించారు ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా సెంట్రల్ జైల్ వద్ద భద్రత పెంచారు. బారికేడ్లని ఏర్పాటు చేసారు.

# అమరావతిపై అందరి కళ్లు...

విజయవాడ, జూన్ 27, హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో పెట్టేందుకు సైబరాబాద్‌కు తానే అంకురార్పణ చేశానని.. అభివృద్ధిని చేశానని చంద్రబాబు గర్వంగా చెప్పుకుంటారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రజలు తనకు మరోసారి రాజధానిని అభివృద్ధి చేసే అవకాశం ఇచ్చారని .. దాన్ని సద్వినియోగం చేసుకుంటానని చెప్పేవారు. అందుకే సెక్రటేరియట్, అసెంబ్లీ, ఉద్యోగుల క్వార్టర్స్, రాజ్ భవన్ వంటివి కట్టి అదే రాజధాని అనిపించుకునే అవకాశం ఉన్నా.. రాజధానిని ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా మార్చాలన్న పట్టుదలతో అమరావతికి రూపకల్పన చేశారు. చంద్రబాబు ఈ సిటీ కోసం అంతర్జాతీయ నిపుణులతో సంప్రదింపులు జరిపి పక్కా ప్రణాళికలు రెడీ చేసుకున్నారు. ఎప్పుడెప్పుడు ఎంతెంత ఖర్చు పెట్టాలి.. ఎలా నిధుల సమీకరణ చేయాలన్న అంశాలపై ఓ బ్లూ ప్రింట్ రెడీ చేసుకున్నారు. ఈ మేరకు అమరావతి ఫైనాన్షియల్ ప్లాన్ గురించి ఫిబ్రవరి 2019లో టీడీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 50ను విడుదల చేసింది. ఈ ప్లాన్ ప్రకారం? అమరావతి నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ. 55,343 కోట్లు. ఇందులో 8 ఏళ్లలో ఖర్చు పెట్టాల్సింది కేవలం 6629 కోట్లు . రాజధానిని ప్రభుత్వం మొదటి నుంచి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్ గా చెబుతూ వస్తోంది. భూములకు మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాత.. వాటి విలువ పెరుగుతోంది. అప్పుడు .. ప్రభుత్వానికి మిగిలే భూమితో సంపాదించుకునే ప్రణాళికలను ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. అందుకే పెద్దగా పెట్టుబడి ఉండాల్సిన అవసరం లేదనుకుంది. అమరావతిలో ఆర్థిక నిపుణులు ఓ గొప్ప ఆర్థిక నమూనాను చూశారు. పట్టణీకరణకు ఓ అద్భుతమైన దిక్సూచిగా మారబోతోందని అంచనా వేశారు. 33వేల ఎకరాలు సమీకరించిన విధానం.. ఆ ప్రాజెక్ట్ పై దేశవ్యాప్తంగా విశ్వాసం పెరగడానికి కారణం అయింది. ఆ ప్రాజెక్ట్‌కు ఎంత క్రేజ్ వచ్చిందంటే రూ. రెండు వేల కోట్ల రుణం కోసం..సీఆర్డీఏ బాండ్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో లిస్ట్ అయితే ఆ మొత్తం నిమిషాల్లోనే వచ్చింది. సాధారణంగా ప్రభుత్వాలకు చెందిన వాటిలో పెట్టుబడులు పెట్టడానికి స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపరు. గతంలో పలు నగరాలు.. అలాంటి ప్రయత్నాలు చేసినా సక్సెస్ కాలేదు. అమరావతి మోడల్ సక్సెస్ అయితే పట్టణీకరణలో కొత్త చరిత్ర ప్రారంభమవుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే వరల్డ్ క్లాస్ సిటీ సెల్ఫ్ ఫైనాన్సింగ్ ద్వారా పూర్తి చేయడం అంటే ఓ గొప్ప సక్సెస్ మోడల్ దొరికినట్లే. అమరావతిపై జగన్ ప్రభుత్వ విధానం అందుకే విమర్శల పాలైంది. ప్రఖ్యాత ఆర్థికవేత్తలు.. బిజినెస్ మీడియాకూడా.. తప్పు పట్టింది. మొదటి బడ్జెట్‌లో అమరావతికి కేవలం ఐదు వందల కోట్లు మాత్రమే ఇచ్చిన వైనం.. ఆ తర్వాత సింగపూర్ తో ఒప్పందం రద్దు చేసుకోవడం వంటి ఆంశాలపై.. బిజినెస్ నిపుణులు తీవ్రంగా స్పందించారు. మోహన్ దాస్ పాయ్ లాంటి పారిశ్రామికవేత్తలు.. శేఖర్ గుప్తా లాంటి జర్నలిజం దిగ్గజాలు కూడా..అమరావతిపై జగన్ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు. కానీ జగన్ తాను అనుకున్నదే చేశారు. ఫలితంగా ఐదేళ్లు ప్రాజెక్టు మూలనపడింది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో మరోసారి ఆశలు చిగురించాయి.2015 అక్టోబర్ 24 నాడు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్సిట్ సచివాలయం, అసెంబ్లీ భవనం, హైకోర్టు నిర్మాణాలు పూర్తయ్యాయి. వినియోగంలోకి వచ్చాయి. డిజైన్ల విషయంలో జాప్యం జరగడంతో సీడ్ క్యాపిటల్ నిర్మాణంలో ఆలస్యమైంది. ఐఏఎస్ అధికారుల భవన సముదాయం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల గృహ సముదాయం, ఎన్జీవోల హౌసింగ్ సహా పలు నిర్మాణాలు చివరి దశకు వచ్చాయి. తొలి దశ పనుల్లో మొత్తం 12,986 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ భవనాలు, గృహాల కోసం రూ. 5,883 కోట్లు, భూసమీకరణ కోసం రూ.12,545 కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రకటించారు. ఎక్కడ ఆగిపోయాయో.. ఐదేళ్ల తర్వాత పనులు అక్కడే ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మళ్లీ అక్కడ్నుంచే ప్రారంభిస్తోంది. గతంలో మొదటి సారి చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడినప్పుడు అమరావతిని రాజధానిగా నిర్ణయించడం, భూమీకరణ, మాస్టర్ ప్లాన్ ఫైనల్ చేయడం, జాతీయ హరిత ట్రిబ్యునల్ లో కేసులు అన్నీ పరిష్కరించుకునే సరికి మూడేళు గడిచిపోయాయి. ఈ సారి అలాంటి సమస్యలు లేవు. పునాదుల మీద నుంచి పనులు ప్రారంభించడమే. అందుకే గతంలో పనులు చేసిన కాంట్రాక్టు సంస్థలతో కాంట్రాక్ట్ తీరిపోయింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా కాంట్రాక్టులు చేసుకోవాలి. అందుకే ప్రభుత్వం నిర్మాణ సంస్థలతో మళ్లీ చర్చలు ప్రారంభించింది. జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్నారు. తొలి దశ రాజధాని పనుల్ని శరవేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం అనుకుంటోంది. దానికి తగ్గట్లుగానే ?ర్పాట్లు చేసుకుంటోంది.చంద్రబాబు అమరావతిని రాత్రికి రాత్రి లేదా ఓ ఐదేళ్లకో.. పదేళ్లకో అభివృద్ధి చేయాలని టార్గెట్ పెట్టుకోలేదు. ఓ క్రమబద్ధమైన అభివృద్ధితో.. సుదీర్ఘమైన ప్రణాళికే పెట్టుకున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, మండలాలలోని 29 గ్రామల పరిధిలో 217.23 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సీడ్ క్యాపిటల్ ఉంటుంది. అమరావతి మహానగరంలో అంతర్భాగంగా 9 నగరాలు నిర్మిస్తారు. రాజధాని అంటే కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం, పరిశోధన, పర్యాటకం, ఆతిథ్యం, కళలు, సాంస్కృతిక, వాణిజ్య, సాంకేతిక కార్యకలాపాలకు ముఖ్య కేంద్రంగా నిలవాలన్నది సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష. ఇవన్నీ వస్తే ఉపాధి అవకాశాలు వాటంతట అవే వస్తాయి. అమరావతి మహానగరంలో అంతర్భాగంగా 9 నగరాలుగా నిర్మించాలని నిర్ణయించారు. 1.ప్రభుత్వ పరిపాలన నగరం 2. న్యాయ నగరం 3. ఆర్థిక నగరం 4.విజ్ఞాన నగరం 5.ఎలక్ట్రానిక్స్ నగరం 6. ఆరోగ్య నగరం 7. ఆటల నగరం 8. మీడియా నగరం 9.పర్యాటక నగరం. దేశ,విదేశాలలో పలు నగరాలను చూసి, వాటి స్ఫూర్తితో ఈ విధంగా ప్రత్యేక నగరాలు నిర్మించాలన్న నిర్ణయానికి చంద్రబాబు వచ్చారు. విశాలమైన రోడ్లు, వాటిలో సైకిల్ ట్రాక్ లు, పచ్చదనం పరిచినట్లు పచ్చికబయళ్లు, పూల మొక్కలు, చల్లదనాన్ని ఇచ్చే చెట్లు, ఫౌంటెన్లు?. ఇలా అందమైన ఓ సుందర నగరం ఏర్పడుతుంది. ఈ నగరాలను కలుపుతూ మెట్రో రైలు మార్గం నిర్మిస్తారు. విజయవాడ, గుంటూరుల నుంచే కాకుండా రాయలసీమ,ఉత్తరాంధ్ర నుంచి కూడా అమరావతికి అనుసంధానం చేస్తూ ఆరు లైన్ల రోడ్లు నిర్మిస్తారు. ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ వెళ్తారు. కనీసం పాతికేళ్ల ప్రణాళిక ఇందులో ఉంది.వచ్చే ఐదేళ్లు అమరావతి నగరానికి అత్యంత కీలకం. పరిపాలనా నగరాన్ని రెండు, మూడేళ్లలో పూర్తి చేయడంతో పాటు తదుపరి దశకు పునాదులు వేయాల్సి ఉంటుంది. అదే సమయంలో అమరావతిని జీవించడానికి అనువుగా ఉండే నగరంగా మార్చాల్సి ఉంటుంది. అలా చేయాలంటే ఉపాధి అవకాశాల్ని మెరుగుపర్చాల్సి ఉంటుంది. అంటే.. ఆఫీసులన్నీ తరలి వచ్చేలా చూడాలి. ఇప్పటికే వందకుపైగా కేంద్ర ప్రభుత్వ సంస్థలకు స్థలాలు కేటాయించారు. గతంలో ప్రముఖ విద్యా సంస్థలకు.. వ్యాపార సంస్థలకు స్థలాలు కేటాయించారు. వారందర్నీ ఒప్పించి నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చేయాల్సి ఉంది. చంద్రబాబుకు అతి పెద్ద సవాల్. వచ్చే ఐదేళ్లలో అమరావతి మొదటి దశను మాస్టర్ ప్లాన్‌లో చెప్పినట్లుగా రూపొందించడం. అదే చేయగలిగితే.. ఆయన తన రాజధాని స్వప్నానికి ఓ రూపం ఇచ్చుకున్నట్లే. ఏపీ రాజధానిగా అమరావతిని ఠీవీగా నిలబెట్టినట్లే.



# ఆలూ లేదు...చూలు లేదు...

## కాంగ్రెస్ లో ముఠాలు, గ్రూపులు



విజయవాడ, జూన్ 27, ఆంధ్రప్రదేశ్ ను సుదీర్ఘకాలంగా పాలించింది కాంగ్రెస్ పార్టీ. కానీ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో ఆ పరిస్థితి మారింది. టిడిపి హవా ముందు కాంగ్రెస్ నిలవలేకపోయింది. టిడిపి ఏర్పడిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి రాగలిగింది. దేశంలోనే తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ పార్టీలకు దిక్సూచిగా నిలిచింది. అయితే అదే తెలుగుదేశం పార్టీని మట్టి కరిపించింది కాంగ్రెస్ పార్టీ. కానీ రాష్ట్ర విభజన పుణ్యమా అని కాంగ్రెస్ పార్టీ ఈ రాష్ట్రంలో సోది లేకుండా పోయింది. కనీసం ఉనికి చాటుకోలేకపోతోంది. ఈ ఎన్నికల్లో రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల ద్వారా బలపడాలని భావించింది. కానీ బలం పెంచుకోలేకపోయింది. వైసిపి పతనంతో బలపడాలనుకున్న కాంగ్రెస్ పార్టీ ఆశలు నీరుగారిపోయాయి. వైసిపి పతనం వరకు ఓకే కానీ.. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఉనికి మాత్రం చాటుకోలేకపోయింది.1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. పార్టీ ఏర్పాటు చేసిన తొమ్మిది నెలల కాలం లోనే ఆ పార్టీ అధికారంలోకి రాగలిగింది. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు ప్రారంభం అయ్యాయి. 1985లో నాదెండ్ల భాస్కరరావు రూపంలో కాంగ్రెస్ పార్టీ టిడిపిని నిలువరించే ప్రయత్నం చేసింది. కానీ నందమూరి తారక రామారావు ప్రజాభిప్రాయాన్ని కోరుతూ ఎన్నికలకు వెళ్లారు. అంతులేని ప్రజామోదంతో అధికారంలోకి రాగలిగారు. కానీ 1989 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి గురికాక తప్పలేదు. అయితే 1994 ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం పార్టీ. 1995లో టిడిపిలో సంక్షోభం ఎదురైనా.. 1995 ఎన్నికల్లో చంద్రబాబు సర్కార్ విజయం సాధించింది. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకుంది. 2009 ఎన్నికల్లోనూ తెలుగుదేశం పార్టీకి చుక్కెదురు అయ్యింది.రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో వైసీపీ ఆవిర్భవించింది. కాంగ్రెస్ పార్టీ స్థానంలో ఉనికి చాటుకునే ప్రయత్నం చేసింది. 2014లో ప్రతిపక్షం స్థానానికి పరిమితమైన వైసీపీ.. 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. ఐదేళ్లపాటు అధికారాన్ని చక్కబెట్టింది. కాంగ్రెస్ పార్టీని పాతాళంలోకి తొక్కింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైసిపి నీడన ఉన్న రాజశేఖర్ రెడ్డి కుమార్తె కాంగ్రెస్ పార్టీలో చేరారు. అధికార పార్టీగా ఉన్న వైసీపీకి ఎదురెల్లి వెళ్లారు. సోదరుడు జగన్ నాయకత్వాన్ని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున బలమైన అభ్యర్థులను బరిలో దించడం ద్వారా వైసీపీని నిలువరించే ప్రయత్నం చేశారు. కానీ ఆ పార్టీ సాధించిన ఓట్లు అంతంత మాత్రమే. మెజారిటీ సర్వేలు కాంగ్రెస్ పార్టీ ఒకటి రెండు సీట్లు సాధిస్తుందని చెప్పినా.. ఓట్లు, సీట్లు పరంగా ఆ పార్టీ సాధించినవి అంతంత మాత్రమే. 40% ఓట్లు సాధించిన వైసీపీతో సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీకి ఐదు శాతం మించి ఓట్లు రాలేదు. కానీ వైసీపీని గద్దెదించామన్న సంతోషంతో కాంగ్రెస్ పార్టీ గడిపేస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చేందుకు షర్మిల నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఎంతగానో దోహద పడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆ పార్టీకి దక్కిన ఓట్లు మాత్రం అంతంత మాత్రమే. కేవలం వైసీపీ ఓటమితో తాము బలపడం అన్న ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉండడం విశేషం.

# జగన్ పై సెటైర్లు...

విజయవాడ, జూన్ 27,ఎక్కువ ఎంపి స్థానాలు ఇవ్వండి. కేంద్రం మెడలు వంచి ఈ రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తాను. ఏపీ రూపురేఖలే మార్చేస్తాను.. 2019 ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత జగన్ తరచూ చేసిన ప్రకటన ఇది. ప్రజలు 22 మంది ఎంపీలను ఇచ్చారు. అయినా కేంద్రం మెడలు వంచలేదు. తిరిగి వంగి వంగి దండాలు పెడుతూ వారికే మద్దతు ఇచ్చారు జగన్. పార్లమెంట్ లోని రెండు సభల్లో సైతం.. ఈ సందర్భంలోనైనా బిజెపికి జై కొట్టారు. నిర్ణయాలు, బిల్లులు, జాతీయ అంశాలు.. ఇలా ఒకటేంటి అన్నింటికీ తమ మద్దతును తెలియజేశారు. కానీ గత ఐదు సంవత్సరాలలో కేంద్రానికి తన అవసరం వచ్చినప్పుడు ప్రత్యేక హోదా మెలిక పెట్టలేదు జగన్.ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకుంది తెలుగుదేశం పార్టీ. మూడు పార్టీలు కలిసి వెళ్లాయి. ఘనవిజయం సాధించాయి. కానీ గత ఐదేళ్లుగా ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగన్ ఎన్నడూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయలేదు. తన అవసరం వచ్చినప్పుడు షరతులు విధించలేదు. కానీ ఇప్పుడు టిడిపి మెజారిటీ ఎంపీ స్థానాలు గెలిచేసరికి.. ప్రత్యేక హోదా తేవాలంటూ సెటైర్లు వేయడం మాత్రం కొంచెం అతిగా ఉంది. తాను చేయలేని పనిని.. మీరైనా చేయండి అని చెబితే బాగుండేది. కానీ తన అసమర్థతను కప్పిపుచ్చుకొని.. టిడిపి పై ప్రత్యేక హోదా బురద చల్లేందుకు జగన్ వేసిన ఎత్తుగడగా తెలుస్తోంది.కేంద్ర పెద్దలు వైసీపీని ఆశ్రయించారు. తాము నిలబెడుతున్న స్పీకర్ అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. పెద్దలు అడిగింది తడవుగా ఓకే చెప్పారు జగన్. తమ మద్దతు ఎప్పుడూ ఎన్డీఏకు ఉంటుందని ఏకంగా లిఖితపూర్వకంగా కూడా తెలియజేశారు. మరి ఇప్పుడు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారా? ఆ షరతుతోనే మద్దతు తెలిపారా? అని టిడిపి సెటైర్లు వేయడం ప్రారంభించింది. ఎన్డీఏ పూర్తి మెజారిటీ ఉంది. 290 మంది ఎంపీలతో మ్యాజిక్ ఫిగర్ కు దాటింది. కానీ అది మిత్రుల మద్దతుతో. అందులో 16 మంది సభ్యులతో టిడిపి కీలకంగా ఉంది. ఒక విధంగా చెప్పాలంటే బిజెపి తర్వాత పెద్ద పార్టీ టిడిపి. కానీ బేషరతుగా వైసీపీ మద్దతు ప్రకటించింది. మొన్నటికి మొన్న ఎన్డీఏలో టిడిపి చేరితే ప్రత్యేక హోదా అడగొచ్చు కదా అని వైసిపి సూచించింది. ఇప్పుడు అదే వైసిపి బిజెపి స్పీకర్ అభ్యర్థికి మద్దతు తెలపడంతో ప్రత్యేక హోదా గురించే కదా.. అంటూ టిడిపి ప్రశ్నిస్తోంది. ఇలా రెండు పక్షాలకు ప్రత్యేక హోదా ప్రధాన ఇష్యూ కావడం గమనార్హం.

టీడీపీ అలెర్ట్...

ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజా ఎన్నికల్లో జగన్ పై ఎన్డీఏ కూటమి విజయం సాధించింది. ఇప్పుడు అదే ఎన్డీఏ కు జగన్ మద్దతు తెలిపారు. ఎన్డీఏ లో కీలక భాగస్వాములుగా చంద్రబాబుతో పాటు పవన్ ఉన్నారు. స్పీకర్ ఎన్నికలకు సంబంధించి ఎన్డీఏకు పూర్తి మెజారిటీ ఉన్నా.. బిజెపి మాత్రం వైసీపీ మద్దతు కోరింది. వెంటనే జగన్ సైతం ఓకే చెప్పారు. అసలు ఏపీ విషయంలో మోదీ వ్యూహం ఏంటన్నది తెలియడం లేదు. మూడు ప్రాంతీయ పార్టీలను తన చెప్పు చేతుల్లోకి తీసుకోవడం ఆసక్తికర పరిణామంగా మారింది. ఏపీలో వైసీపీకి నలుగురు పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. వారు స్పీకర్ ఎన్నికల్లో ఎన్డీఏ నిలిపిన అభ్యర్థికి ఓటు వేయనున్నారు. ఎన్డీఏకు పూర్తి మెజారిటీ ఉంది. 293 మంది సభ్యుల బలం ఉంది. కానీ బిజెపి నాయకత్వం మాత్రం నలుగురు సభ్యులు ఉన్న వైసీపీ మద్దతును కోరింది. 2019 నుంచి ఐదేళ్ల పాటు జగన్ కేంద్రం విషయంలో ఎలా నడుచుకున్నది అందరికీ తెలిసిన విషయమే. కేంద్రానికి అవసరమైన ప్రతిసారి జగన్ మద్దతు తెలుపుతూ వచ్చారు. ఎన్డీఏలో టిడిపి, జనసేన ఉండడంతో స్పీకర్ ఎన్నికల్లో వైసిపి ఎలా వ్యవహరిస్తుంది అన్నది చర్చగా మారింది. కానీ బిజెపి నుంచి మద్దతు కావాలని ప్రతిపాదన రావడం.. దానికి జగన్ ఓకే చెప్పేయడం జరిగిపోయింది. లోక్సభలో వైసిపి పార్లమెంటరీ నేత మిథున్ రెడ్డితో బిజెపి నేతలు చర్చించారు. వెంటనే ఆయన జగన్ తో చర్చలు జరిపారు. ఎన్డీఏకు మద్దతు ఉంటుందని ప్రకటన కూడా వచ్చింది.

# కేంద్రంపైనే పోలవరం ఆశలు

ఏలూరు, జూన్ 27,పోలవరం ప్రాజెక్ట్ ఏపీకి జీవనాడి, ఇది దశాబ్దాల కల. క్లిష్టమైన డిజైన్ అంతకు మించి సవాళ్లతో కూడిన నిర్మాణం. అనుమతులు.. డిజైన్లు, నిధులు పేరుతో ఏళ్లకేళ్లు గడిచిపోతూనే ఉన్నాయి. అరవై ఏళ్లుగా ఈ ప్రాజెక్టు చర్చల్లోనే ఉంది. రాష్ట్ర విభజన పుణ్యమా అని ప్రాజెక్టుకు జాతీయ హోదా వచ్చింది. 2014-19 మధ్య నిర్మాణం పరుగులు పెట్టినా..అత్యంత కీలకమైన సహాయ, పునరావాసంపై మాత్రం పీటముడి పడిపోయింది. జాతీయ ప్రాజెక్టు హోదా ఇచ్చినా తాము డ్యామ్ నిర్మాణానికే నిధులిస్తామని సహాయ, పునరావాసం తమ బాధ్యత కాదని వాదించింది. తర్వాత అంచనాలను తగ్గించేసింది. ఇలాంటి సమస్యలతో వైసీపీ హయాంలో ఐదేళు ఆగిపోవడంతో.. అనేక సమస్యలు వచ్చాయి. ఇప్పుడు వచ్చే మూడు, నాలుగు సీజన్లలో డ్యామ్ పూర్తి చేసినా... నీళ్లు నిలపాలంటే.. సహాయ, పునరావాసం పూర్తి చేయాల్సి ఉంటుంది. అలా చేయాలంటే కేంద్రం నుంచి సహకారం రావాల్సిందే. మరి కేంద్రం అందుకు సిద్ధంగా ఉందా ? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం 2013 సెక్షన్ 90(1) ప్రకారం పోలవరంకు జాతీయ హోదా వచ్చింది. సెక్షన్ 90(4) ప్రకారం, నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే అని స్పష్టంగా పేర్కొన్నారు. కేంద్రం పర్యవేక్షణ చేస్తే ఎప్పటికి పూర్తవుతుందో చెప్పడం కాబట్టి.. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్మిస్తే నిధులు రీఎంబర్స్ చేసేలా ఒప్పంద చేసుకున్నారు. మొదట్లో ట్రాన్స్ ట్రాయ్, ఆ తర్వాత నవయుగ కంపెనీల ఆధ్వర్యంలో పనులు జరిగాయి.జగన్ ప్రభుత్వం కాంట్రాక్టర్లను మార్చి మిగలిన పనులు మేఘ కంపెనీని అప్పగించింది. కానీ ఆ సంస్థ పనులు వేగంగా చేపట్టడంలో విఫలమయింది. అనేక సమస్యలు వచ్చాయి. పోలవరం ప్రధాన డ్యాం పనులు ఇప్పటికే 78 శాతం పనులు పూర్తి అయ్యాయి. అత్యంత కీలకమైన ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్‌డ్యామ్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కొట్టుకుపోయి ప్రధాన డ్యామ్ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న డయాఫ్రమ్ వాల్ నిర్మాణంపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉంది. డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు ఎంతవరకు భద్రంగా ఉన్నాయో తేల్చాలి. డయాఫ్రం వాల్ కొత్తగా నిర్మించాలనే ప్రతిపాదన ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. గోదావరిలో మట్టి స్వభావం వల్ల నది మధ్యలో స్పిల్ వే నిర్మించే అవకాశం లేదు. దీంతో నది ప్రవాహమార్గాన్ని మార్చి, కొండలు ఉన్నచోట ఊళ్లన్నీ ఖాళీ చేయించి, అక్కడ స్పిల్ వే నిర్మించారు. గోదావరి మధ్యలో ప్రధాన డ్యాం నిర్మించాలి. ఆ కట్ట దిగువన డయాఫ్రం వాల్ విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రధాన డ్యాం నిర్మించేందుకు వీలుగా ప్రవాహాన్ని మళ్లించేందుకు ఎగువన, దిగువన కాఫర్ డ్యాంలు నిర్మించారు. ప్రాజెక్టులోనే ప్రాజెక్టులోనే అత్యంత కీలక కట్టడం డయాఫ్రం వాల్. చంద్రబాబు హయాంలో విదేశీ కంపెనీ బావర్‌తో ఈ పనులు చేయించారు. నదీగర్భంలో 70 మీటర్ల లోతు నుంచి ఈ కట్ ఆఫ్ వాల్ నిర్మించాల్సి వచ్చింది. జగన్ హయాంలో ఈ నిర్మాణాన్ని వరదల నుంచి రక్షించలేకపోయారు. ఎగువ కాఫర్ డ్యాంలో ఉన్న గ్యాప్‌లను సకాలంలో పూడ్చకపోవడంతో 2020 వరదలకు ఈ డయాఫ్రం వాల్ ధ్వంసమైంది. మళ్లీ డయాఫ్రం వాల్ నిర్మించుకోవాలి. ఇందుకు రెండు సీజన్ల సమయం పడుతుంది. ఆపైన మళ్లీ ప్రధాన డ్యాం నిర్మించాలి. అంటే ఎంత లేదన్నా ఐదేళ్లు పడుతుంది. పోలవరం సవరించిన అంచనాలను చంద్రబాబు హయాంలో రూ.55,656 కోట్లకు కేంద్ర జలసంఘం ఆమోదించింది. తర్వాత రివైజ్డ్ కాస్ట్‌కమిటీ రూ.47,725,74 కోట్లకు సిఫార్సు చేసింది. ఆ నిధులకు ఇంతవరకు కేంద్రం ఆమోదించలేదు. మరోవైపు జగన్ హయాంలో తొలిదశ నిధులు అంటూ 41.15 మీటర్ల స్థాయి పునరావాసాన్ని, భూసేకరణను పరిగణనలోకి తీసుకుని, కట్టడాల కాలువల విషయంలో యథాతథ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని రూ.31,625 కోట్లకు కేంద్ర జలసంఘం సిఫార్సు చేసింది. ఆ నిధులతో పోలవరం పూర్తిచేయడం సాధ్యం కాదు. తమకు పరిహారం చెల్లించకుండానే బలవంతంగా ముంపు ప్రాంతాల నుంచి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ జాతీయ ఎస్టీ కమిషన్‌కు గిరిజనులు ఫిర్యాదుచేశారు. దీనిపై 15 రోజుల్లో సమాధానం చెప్పాలని సీఎస్‌ను తాజాగాఎస్టీ కమిషన్ ఆదేశించింది. ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యంతో 196టీఎంసీలు నిల్వ చేయాలంటే 45.72 మీటర్ల కాంటూరు మేరకు భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉంది. ఇందుకోసం 85,136 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. 53,192 ఎకరాల భూమి సేకరించి పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం రూ. ఏడు వేల కోట్లు వ్యయమవుతాయని అంచనా. ఈ మొత్తం మున్ముందు మరింత పెరిగే అవకాశాలూ ఉన్నాయి. నిర్వాసితులు కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరితే.. భూముల విలువ అమాంతం పెరిగిపోతోంది. పునరావాస గృహాల నిర్మాణానికి రూ.12,88 కోట్లు ఖర్చుచేయాలి. అంటే రాష్ట్రప్రభుత్వం రూ.26 వేల కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. 41.15 మీటర్ల కాంటూరులో 115టీఎంసీల నిల్వకే పరిమితం చేయాలని గత ప్రభుత్వం అనుకుంది. కానీ అలా చేస్తే అది బహుళార్థక సాధక ప్రాజెక్టుగా కాక..త సాదాసీదా ఎత్తిపోతలగా మిగిలిపోతుంది. పోలవరం వంటి ప్రాజెక్టు పూర్తయితే.. ఒక్క ఏపీకి మాత్రమే లాభం ఉండదు. దేశానికి అదో పెద్ద ఆస్తి అవుతుంది. నదుల అనుసంధాన మహా యజ్ఞంలో అతి పెద్ద ముందడుగు పడినట్లవుతుంది. అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు అవుతుందని కేంద్రమే అనేక సార్లు చెప్పింది. అందుకే ప్రాజెక్టు పూర్తయ్యేలా కేంద్రం సహకరిస్తుందని ఆశతో ఉన్నారు. లేకపోతే అంచనాలు పెరిగిపోతూ పోవడమే తప్ప.. దాని వల్ల కలిగే ప్రయోజనాలు ఎప్పటికి వస్తాయో అంచనా వేయడం కష్టం.

# మంత్రులకు టీడీపీ ఫ్రీ హ్యాండ్

విజయవాడ, జూన్ 27, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గత వైసీపీ ప్రభుత్వానికి, ఇప్పటి సర్కార్ కు మధ్య పోలికలు వస్తుంటాయి. అయితే గత ప్రభుత్వంలో పాలన అంతా ఏకపక్షంగా సాగిందన్న విమర్శలున్నాయి. కొందరి చేతుల్లోనే పాలన ఉందన్నది అందరూ అంగీకరించే విషయమే. అన్ని శాఖలకు మంత్రులున్నా, లెక్కకు మించి డిప్యూటీ చీఫ్ మినిస్టర్లున్నా వారంతా ఉత్సవ విగ్రహాలేనంటూ ఆరోపణలు వినిపించాయి. సకల శాఖల మంత్రి అంటూ కోటరీ నేతలపై విమర్శలు కూడా పెద్దయెత్తున విమర్శలు వినిపించాయి. అంటే గత వైసీపీ ప్రభుత్వం లో మంత్రులకు స్వేచ్ఛ లేదు. స్వతంత్రంగా తమ శాఖలో నిర్ణయాలు తీసుకునే అధికారం కూడా లేదు. గత ప్రభుత్వ హయాంలో... అధికారి బదిలీ కావాన్నా సీఎం పేషినో, సకల శాఖల మంత్రినో సంప్రదించాలన్నది నాటి ప్రభుత్వంలో వినిపించే విమర్శలు. కాకుంటే పదవి కావడం, పేరు ముందు మంత్రి ఉండటం, ప్రొటోకాల్ కూడా ఉండటంతో మంత్రులు గత పాలనలో కిమ్మనలేదు. తమకు అవసరమైన పనులు తాము తీసుకోవాలంటే అందుకు కొందరి అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. బదిలీల నుంచి ముఖ్య నిర్ణయాలను తీసుకునేందుకు మంత్రులు తాడేపల్లి కార్యాలయం వైపు చూసేవారంటారు. అందుకే కొందరు మంత్రులుగా ఉన్నప్పటికీ స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోలేకపోయారు. సంస్కరణలను కూడా తమ శాఖల్లో తేలేకపోయారన్న విమర్శలు వినిపించాయి.. అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని చెబుతున్నారు. ప్రజోపయోగమైన ఏ నిర్ణయమైనా అధికారులతో చర్చించి తీసుకోవాలని మొన్న జరిగిన కేబినెట్ మీటింగ్ లో ఆయన మంత్రులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే అధికారులు చెప్పిన ప్రతి మాటకు తలాడించకుండా అందులో లోతుపాతులను పరిశీలించిన తర్వాతనే నిర్ణయం తీసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. ప్రజా ప్రయోజనాలు దెబ్బతినకుండా, రాష్ట్ర ఖజానాపై భారం పడకుండా ప్రజల సంక్షేమ కోసం తీసుకునే ఏ నిర్ణయాలనైనా తాను స్వాగతిస్తానని, అన్నీ తన దృష్టికి తీసుకురావాల్సిన అవసరం లేదని కూడా ఆయన మంత్రివర్గ సమావేశంలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది.కానీ ఈసారి మాత్రం తన ఆలోచనను మార్చుకున్నారని మంత్రులే వ్యాఖ్యానిస్తున్నారు. పరిపాలన సజావుగా సాగాలన్నా అందరి భాగస్వామ్యం ఉండాలని, అందరి ఆలోచనలతోనే ముందుకు వెళ్లగలిగితేనే మనం గోల్ రీచ్ అవుతామని కూడా ఆయన వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. మీడియాకు ఒక విధానమైన ప్రకటన చేసే ముందు కూడా అనుభవజ్ఞులైన అధికారులతో చర్చించి చేయాలని, అలాకాకుండా ప్రకటన చేసి వెనక్కు వెళితే నవ్వుల పాలు అవుతామని కొత్తగా ఎన్నికైన మంత్రులకు సూచించినట్లు సమాచారం. ఈసారి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అంతా తానే అయి వ్యవహరించకుండా మంత్రులకు కూడా పూర్తి భాగస్వామ్యం కల్పించాలని చంద్రబాబు ఈనిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. ఇటు డిప్యూటీ చీఫ్ మినిస్టర్ దృష్టికి కూడా అన్ని శాఖల ప్రధాన సమస్యలను తీసుకెళ్లవచ్చని కూడా ఆయన సమావేశంలో చెప్పినట్లు తెలిసింది.

# అధైర్య పడవద్దు

## ఎమ్మెల్సీ గోవిందరెడ్డి బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా

బద్వేలు,బద్వేలు పట్టణంలో గురువారం పార్టీ ఆఫీస్ నందు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే సుధమ్మ వైఎస్ఆర్సీపీ పార్టీ సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగింది. వారు మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీ కి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ .అలాగే మన పార్టీ ఓడిపోయింది అని ఎవరు అధైర్యపడనవసరం లేదు,లోకల్ బాడీ లో మరియు జిల్లా పరిషత్ చైర్మన్ అన్ని మన పార్టీ వల్లే ఉన్నారు మీరు ధైర్యం గా ఉండండి.అలాగే కార్యకర్తలు ఏ ఆపద వచ్చిన మీకు మేము ఉన్నాను అని తెలియచేశారు . మన పార్టీ కి రాష్ట్ర ప్రజలు 40 పర్సంట్ ఓట్లు వేశారు.మీరు అందరూ పార్టీ కి అండ దండలగా ఉండి కృషి చెయ్యాలి అని కోరారు.మీకు ఏ అవసరం వచ్చిన మేము మీకు అందరికీ బద్వేలు ఎమ్మెల్యే ఆఫీస్ నందు పోరుమామిళ్ల పార్టీ కార్యాలయం లో నందు అందుబాటు లో ఉంటాని తెలిపారు. అలాగే రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత మన జగనన్న కే దక్కుతుంది అని .అటువంటి ముఖ్యమంత్రి నీ ప్రజలు ఓడించారు అని.అలాగే ప్రజా తీర్పును గౌరవ ఇస్తూ మరల 2029 లో మరల రాష్ట్ర ముఖ్యమంత్రి గా జగన్ మోహన్ రెడ్డి గారిని చేయుటకు కృషి చెయ్యాలి తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బూత్ కన్వీనర్లు సమన్వయకర్తరమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్ , కౌన్సిలర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలో, సర్పంచులు ఎంపీటీసీలు పలు ప్రజాప్రతినిధులుబద్వేల్ మున్సిపాలిటీ నాయకులు బద్వేల్ మండల నాయకులు అట్లూరు గోపవరం మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు

## ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో రోడ్డు మరమ్మతు పనులు.





నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని టి లింగం దిన్నె గ్రామంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టినట్లు సర్పంచ్ మీసాల లక్ష్మీదేవి, టిడిపి నాయకుడు చిన్నకృష్ణ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ గ్రామంలోని కొన్ని కాలనీలలో దెబ్బతిన్న రోడ్లను పంచాయతీ నిధులు కేటాయించి మరమ్మత్తు పనులు చేపట్టామన్నారు. ప్రజలు రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతూ ఉండడంతో రోడ్డు మరమ్మతుపనులు చేపట్టామని వారు తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామంలో ప్రజల కు ఎలాంటిసమస్యలు లేకుండా పరిష్కరిస్తామని వారు తెలిపారు.

## గర్భవతులు బాలింతలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-గర్భవతులు బాలింతలు పౌష్టికారమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని నంద్యాల జిల్లా టాస్కోర్స్ కమిటీ సభ్యురాలు వైద్య ఆరోగ్యశాఖ గణాంక అధికారి పి సుజాత గర్భవతులకు బాలింతలకు సూచించారు. మండల పరిధిలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా టాస్కోర్స్ కమిటీ సభ్యులు సందర్శించారు అలాగే తిప్పారెడ్డిపల్లె గ్రామంలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు వెల్నెస్ సెంటర్లోని హెచ్ఎంఐఎస్ రిపోర్టులు ఆర్ సి హెచ్ పోర్టల్ మరియు ఫీల్డ్ రిజిస్టర్స్ గర్భవతులకు సంబంధించిన ఎన్సీపీ కార్డులు పరిశీలించి గర్భవతులకు ప్రత్యక్షంగా వైద్య పరీక్షలు, కౌమార వయసులో ఉన్న బాలబాలికలకు నిర్వహించి రికార్డులలో నమోదు చేసిన వివరాలను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, లావణ్య, కమిటీ సభ్యులు, వైద్యాధికారి బాబు, వైద్య సిబ్బంది నాగప్రసాద్ భూలక్ష్మి రాములమ్మ నిరీక్షణ పలువురు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## షిరిడీ సాయి వృద్ధుల శరణాలయం, కర్నూలు ను సందర్శించిన న్యాయమూర్తి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గారు ఈ రోజు అనగా 27-06-2024 న కర్నూలు నందు గల షిరిడీ సాయి వృద్ధుల శరణాలయం ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలకు, మహిళలకు, అవగాహన సదస్సులను నిర్వహించడమైనది, ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గారు వృద్ధులకు సంబందించిన చట్టాలను, ఉచిత న్యాయ సహాయమును మరియు లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొనారు.



# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి....

యు ఓపి ఆర్ డి ,శ్రీనివాస శర్మ.

మురికి నీటి కుంటలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న ఈవోపీఆర్డి శ్రీనివాస శర్మ ,సిబ్బంది.

పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డి శ్రీనివాస శర్మ.





నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఈవో పీఆర్డి శ్రీనివాస శర్మ తెలిపారు. గురువారం అయిన మండలంలోని నరసాపురం గ్రామంలో ని పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిలువచేరి అందులో దోమలు వృద్ధి చెందుతాయి అన్నారు. దోమల వల్ల మలేరియా ,డెంగు టైఫాయిడ్, తదితర వ్యాధులు వస్తాయన్నారు. అలాగే నీరు కలుషితం కావడంవల్ల అతిసార వ్యాధి వస్తుందన్నారు. ప్రజలు గ్రామాలలో ఎక్కడైనా నీరు నిలువ ఉంటే అందులో దోమలు వృద్ధి చెందకుండా వేస్ట్ ఆయిల్ బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. అలాగే పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలన్నారు. త్రాగు నీటిని కాచి వడబోసి తాగాలన్నారు. నిద్రించే సమయంలో దోమతెరలను తప్పనిసరిగా వాడాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు పరిశుభ్రత పాటించడం లేదన్నారు. విద్యార్థులు భోజన సమయంలో సబ్బుతో రెండు చేతులు శుభ్రంగా కడిగించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. నరసాపురంలోని అన్ని పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. మార్తమా పాఠశాలలో మంచినీటి సరఫరా ట్యాంకులను స్కూలు యాజమాన్యం శుభ్రం చేయించడం లేదని వెంటనే శుభ్రం చేయించాలని యాజమాన్యానికి సూచించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా నీటి సరఫరా ట్యాంకులను శుభ్రంగా కడిగించాలన్నారు. ప్రతి శుక్రవారం ఆయా గ్రామపంచాయతీలలో కార్యదర్శిలు డ్రై డే పాటించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# వరి నారుమడిలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-వరి నారుమడిలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. బాలస్వామి తండా,చిత్రేనిపల్లె గ్రామాలలో గ్రామసభ ఏర్పాటు చేసి వరి నారుమడి యాజమాన్యంలో తీసుకోవాల్సిన మెలకువలు గురించి వివరించారు. ముఖ్యంగా వరి నారుమడి యాజమాన్యంలో విత్తన శుద్ధి వలన వివిధ రకాల తెగుళ్ళ బారి నుంచి కాపాడుకోవచ్చు అని తెలిపారు. ఇందులో ముఖ్యంగా సుడోమోనాస్ ఒక కేజీ విత్తనానికి 10 గ్రాముల మందును కలిపి నారుమడిలో చల్లుకోవాలి అదేవిధంగా నారుమడిలో వచ్చే అగ్గి తెగులును నివారించుట కొరకు సుడోమోనాస్ ను లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలి. ఎదిగిన నారుమడిలో ఉల్లికోడు మరియు కాండం తొలుచు పురుగు నివారణ కొరకు కార్బో ఫిరన్ 3జి గుళికలు 15 రోజుల వయసుగల నారుమడిలో ఒక ఎకరా నారుమడికి 160 గ్రాములు చొప్పున మరియు నారు 25 రోజుల వయసులో మరొకసారి ఎకర నారుమాటడికి 120 గ్రాములు చల్లుకున్నట్లయితే పైన తెలిపిన పురుగులను నివారించుకోవచ్చు అని తెలిపారు ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పవిత్ర గ్రామ రైతులు ముద్దం నాగప్రసాద్ షేక్ రహీం తుల్లా, నరసింహ గౌడ్,గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పథకాలు పునరుద్ధరించండి

జిల్లా కాంగ్రెస్ డిమాండ్



ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ తెలియజేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అనంత రత్నం మాదిగ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలు నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు రద్దు చేయడం జరిగిందని. నేటి తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఆ పథకాలన్నింటినీ పునరుద్ధరించాలని కోరుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు ఎన్ఎస్ఎఫ్ డిసి పది లక్షల నుండి 50 లక్షల వరకు కార్లు, జెసిబిలు, కుటీర పరిశ్రమలు బ్యాంకు లింకుడు సేవలు, పేద ఎస్సీ ఎస్టీలకు భూమి కొనుగోలు పథకం, మొత్తం 27 పథకాలను పునరుద్ధరణ చేసి అమలు చేయాలని, ఎస్సీల అభివృద్ధికి పాటుపడాలని అలాగే మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలను మైనార్టీలకు వర్తింపజేయాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలను బీసీల అభివృద్ధి చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ ఎస్టీలకు పథకాలను అందేలా చూడాలని అనంతరత్నం గారు నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి విజ్ఞప్తి చేశారు. అనంతరం కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు 130 హామీలు ఇచ్చి మాట ఇచ్చి మడమ చెప్పారని, టిడిపి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల పథకాలు అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల పథకాలకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు వాడుకోకుండా వీటికి అమలు చేయాలని అలాగే సూపర్ సిక్స్ పథకాలు త్వరితగతిన అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఎన్ సి బజారన్న, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ డిసిసి కార్యదర్శులు ఎజాజ్ అహ్మద్, జాన్ సదానందం మొదలగు వారు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నిజాయితీ చాటుకున్న విజిలెన్స్ సిబ్బంది

తిరుపతి,తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో విజిలెన్స్ సిబ్బంది తమ నిజాయితీని చాటుకున్నారు.పర్సు పోగొట్టుకొని ఆందోళనలో ఉన్న భక్తులకు పర్సును అందజేసి ఊరటను కలిగించారు. వివరాల్లోకెళితే కర్ణాటక రాష్ట్రం ములభాగల్ కి చెందిన జమున తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చారు. దర్శనానంతరం ప్రసాదం అందజేసే క్యూలైన్లో ఆమె మనీ పర్స్ పోగొట్టుకున్నారు. ఈ విషయాన్ని గ్రహించిన భక్తులు ఆందోళనకు లోనయ్యారు.ఈ నేపధ్యంలో క్యూ లైన్ లో దొరికిన పర్సును విజిలెన్స్ అధికారులు ఆలయ సూపరింటెండెంట్ మధు దృష్టికి తీసుకొచ్చారు. పర్సులోని గుర్తింపు కార్డు ఆధారంగా మైక్ సెట్ ద్వారా

అనౌన్స్మెంట్ చేయగా భక్తులు సూపరింటెండెంట్ కార్యాలయం చేరుకున్నారు. పర్సులోని రూ 28,000,విలువైన బ్యాంక్ క్రెడిట్ కార్డులు,డెబిట్ కార్డులు, కొన్ని పత్రాలు భక్తురాలు జమున కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు అందజేశారు. ఆలయ సిబ్బంది అధికారులు నిజాయితీకి భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. విజిలెన్స్ ఏఎస్ ఐ బ్రహ్మానందం రాజు, సూపరింటెండెంట్ మధు, విజిలెన్స్ సిబ్బందిని ఆలయ డిప్యూటీవో గోవింద రాజన్, ఏవీఎస్ఓ సతీష్ కుమార్ అభినందించారు.

# త్వరలో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు.

ఇన్చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య.



కర్నూలు జూన్ 27:-జిల్లాలో వీఆర్వోల ద్వారా వెరిఫికేషన్ చేయించిన తరువాత కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయబడతాయి అని ఇన్చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, కులాలకు సంబంధించి ఇంకా 2,29,685 మంది కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోని వారు ఉన్నారని సిసిఎల్ఏ గారి ఆదేశానుసారం ఈరోజు నుంచి వీఆర్వోల ద్వారా ఇంటింటి సర్వే చేయించి వారి కులము,మొబైల్ నెంబర్ తదితర పూర్తి వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తారని , నమోదైన వివరాలను ఆయా తహసిల్దార్ లు కుల ధ్రువీకరణ చేసిన తర్వాత ఆయా కులాలకు సంబంధించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఆటోమేటిక్ గా జనరేట్ కాబడతాయని జనరేట్ కాబడిన ధ్రువీకరణ పత్రాలను సచివాలయల ద్వారా పొందవచ్చునని ఇంచార్జ్ కలెక్టర్ తెలియజేశారు....

# వామ్మో భారీ సైజ్ లో పుట్టగొడుగు

అనంతపురంఅక్షరాల ఐదు కేజీల బరువు ఉన్న పుట్టగొడుగు.. ఓ రైతు పొలంలో పుట్టుకొచ్చింది. పుట్టగొడుగులు పెంచే ఫామ్?లో కూడా అంత భారీ పుట్టగొడుగు పెరగదేమో. అనంతపురం జిల్లా కుందుర్పి మండలం జానంపల్లికి చెందిన వడ్డే హనుమంతరాయుడు అనే రైతు పొలంలో ఇటీవల ఓ పుట్టగొడుగు బయటకు వచ్చింది. పొలం నుంచి బయటకు పుట్టుకొచ్చిన పుట్టగొడుగును తవ్వి తీశాడు రైతు హనుమంతురాయుడు. ఆ భారీ సైజులో ఉంటే పుట్టగొడుగును చూసి షాక్ అయ్యాడు. అదేవిధంగా దాని బరువు చూసి కంగుతిన్నాడు. రెండు అడుగుల వెడల్పుతో ఐదు కిలోల బరువు ఉన్న పుట్టగొడుగు చూసిన స్థానికులు, చుట్టుపక్క రైతులు ఆశ్చర్యపోయారు. 5 కిలోల బరువు ఉన్న అరుదైన భారీ పుట్టగొడుగు చూసేందుకు రైతు హనుమంతరాయుడు ఇంటికి జనం క్యూ కడుతున్నారు.బస్తా పుట్టగొడుగులు పట్టుమని కిలో బరువు కూడా ఉండవు. కానీ ఈ పుట్టగొడుగు వెరైటీగా.. 5 కేజీల బరువు ఉంది. ఇంత పెద్ద పుట్టగొడుగును తాను ఎప్పుడు చూడలేదని రైతు హనుమంతురాయుడు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాడు. అంత భారీ పుట్టగొడుగును.. అరుదైనదిగా భావించి పరిశోధన కోసం వ్యవసాయ అధికారులకు అప్పగించారు. అరుదైన ఐదు కిలోల వెరైటీ పుట్టగొడుగును కళ్యాణదుర్గంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పరిశోధనకు తరలించారు. సాధారణంగా వర్షాలు పడే సమయంలో వ్యవసాయ పొలాల్లో పుట్టగొడుగులు పుట్టుకు రావడం సహజమే.. కానీ ఇంత భారీ పుట్టగొడుగు అరుదైన ఐదు కిలోల పుట్టగొడుగు స్థానికంగా చర్చనీయాంశమైంది.

## తాడేపల్లిగూడెంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి

-ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం,తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని మెడికల్ హబ్ గా తయారు చేస్తామని మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి నీ గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో అత్యాధునిక సాంకేతిక టెస్టింగ్ యూనిట్ లు ఉన్నాయని, వాటి ద్వారా నెలకు 22,000 మందికి 90 రకాల పరీక్షలు చేసే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో వాటిని మరింత అభివృద్ధి చేసి పేద ప్రజల ప్రాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య చికిత్సలు అందిస్తామన్నారు. నరసాపురం ఎంపీ, కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపడుతున్నారని ఆయన ద్వారా ఆసుపత్రికి ప్రత్యేక సదుపాయాలతో పాటు మరింతమంది వైద్యుల నియామకం కోసం కృషి చేస్తామన్నారు. తాడేపల్లిగూడెం ఇప్పటికే వంద పడకల ఆసుపత్రి ప్రజలకు సేవలు అందిస్తుండగా మరో 600 పడకల ను పెంచే విధంగాచర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్యులు కూడా వారికి శక్తికి మించి పేద ప్రజలకు సేవలందించి రాష్ట్రంలోనే తాడేపల్లిగూడెంను వైద్యరంగంలో ముందుంచేందుకు కృషి చేయాలన్నారు. అవసరమైతే ప్రైవేట్ హాస్పిటల్ నుంచి వైద్యుల సహకారం కూడా తీసుకుంటామని వారితో ఇప్పటికే మాట్లాడామన్నారు. ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం తాతారావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ మూర్తి మరియు 11 వ వార్డు ఉమ్మడి నాయకులు కాళ్ల గోపి, ఏరుబండి సతీష్, యాదవ శివాజీ, కిషోర్ సాయి జగదీష్, తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఉమ్మడి నాయకులు వర్తనపల్లి కాశి, పట్నాల రాంపండు, గురుజు సూరిబాబు, పై బోయిన రఘు, పాలూరి వెంకటేశ్వరరావు, పుల్లా బాబి, సజ్జ సుబ్బు, మద్దాల మణికుమార్, గుండుమోగుల సురేష్, చాపల రమేష్, కేశవభట్ల విజయ్, రౌతు సోమరాజు, పైబోయిన వెంకటరామయ్య, నీలిపాల దినేష్ యాదవ్, బైయనపాలెపు ముఖేష్ సందాక రమణ, కూచిపూడి వెంకటరత్నజీ, మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757